క్లుప్తంగా

ఏడు ఇసుక లారీలు సీజ్

సీతానగరం: నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్న లారీలను ఎస్సై డి.రామ్‌కుమార్ సీజ్ చేశారు. ప్రభుత్వం అనుమతించిన వంగలపూడి ర్యాంపు నుంచి గురువారం రాత్రి 11 గంటలకు ఏడు ఇసుక లారీలను ఎస్సై సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక లారీలు వెళ్లడానికి అనుమతి ఉంది. పర్మిషన్ లేని సమయంలో ఇసుకను తరలిస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు అందించినట్లు ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

రేపు బళ్లమ్మ తీర్థం


ప్రత్యేకాలంకరణలో బళ్లమ్మ వారు

పెదపూడి: గ్రామంలో కొలువైన బళ్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ తీర్థానికి మండలం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. అలాగే భక్తుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహిస్తారు. భారీ బాణసంచా, గరగ నృత్యాలు, బ్యాండ్ మేళాలు, ప్రత్యేక ఆకర్షణగా శక్తి వేషాలు, డప్పు వాయిద్యాలు తదితర ప్రదర్శనలు జరుగుతాయి.

ఘనంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం


రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి

పెదపూడి: కుమారప్రియం గ్రామంలోని రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి 26వ వార్షిక కల్యాణం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై, కల్యాణాన్ని తిలకించి భక్తిపరవశులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త నున్న వీర్రాజు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కల్యాణ మంటపం నిర్మాణానికి సహకరించిన ధర్మకర్త నున్న వీర్రాజు, సావిత్రి దంపతులు, వారి కుమారులను గ్రామస్తులు అభినందించారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

పెదపూడి: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పని చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించే వారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలుత వ్యవసాయ, విద్య, పశు సంవర్ధక తదితర శాఖలపై సంబంధిత అధికారులు మూడు నెలల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరేంద్ర రెడ్డి, తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

స్కూలు ప్రహరీ ప్రారంభం


పాఠశాల ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

రాజానగరం: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పి, వారికి మంచి భవిష్యత్తును అందించాలని కోరారు. కొండగుంటూరు ప్రభుత్వ పాఠశాలకు బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్నచౌదరి సహకారంతో రూ.12 లక్షలతో నిర్మించిన ప్రహరీని శుక్రవారం ఎమ్మెల్సీ ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య!

రాజానగరం: స్థానిక జాతీయ రహదారిపై నిర్మానుష్య ప్రదేశంలో 60 సంవత్సరాల వృద్ధుడి మృతదేహాన్ని రాజానగరం పోలీసులు స్థానికుల ద్వారా శుక్రవారం కనుగొన్నారు. మృతదేహం ఉన్న స్థితిని బట్టి ఈ మృతి జరిగి 30 రోజులు పైబడి ఉంటుందని కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు. అతడి వద్ద దొరికిన ఆధారాల ద్వారా నిజామాబాద్‌కి చెందిన పువ్వల సింహాచలంగా గుర్తించామన్నారు. మృతుడు గత కొంతకాలంగా కాకినాడలో ఉన్న కుమార్తె వద్ద ఉండేవాడన్నారు. అతడి కుమారుడు వైజాగ్‌లో ఉంటాడన్నారు. ఇరువురికీ సమాచారం అందజేశామని చెప్పారు. అయితే మృతదేహం వద్ద లభించిన ఖాళీ పురుగుమందు సీసాను బట్టి ఆత్మహత్యకు పాల్పడి వుండవచ్చనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

దిగుపడిపోయె..

- జీడి మామిడి రైతులకు నిరాశ
- ధర ఉన్నా.. దిగుబడి సున్నా
- ప్రతికూల పరిస్థితులతో నష్టాలు
- రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 4,182 హెక్టార్లలో సాగు


గాదరాడలోని జీడి మామిడి తోట

కోరుకొండ: మెట్ట ప్రాంతమైన రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లోని రైతులకు జీడి మామిడి సాగు నిరాశ మిగిల్చింది. ఎకరం విస్తీర్ణంలో 70–80 జీడిమామిడి చెట్లు ఉంటాయి. దీని ద్వారా 500 నుంచి 700 కేజీల దిగుబడి రావాలి. కానీ ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దిగుబడి సగం కూడా లేదు. మార్చి నెలాఖరుకు రావాల్సిన దిగుబడి కాస్తా ఏప్రిల్ నెలాఖరు వస్తున్నా పంట ఇంకా దిగుబడికి రాలేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. పెట్టుబడిగా ఏడాదికి రూ.25 వేలు ఖర్చవుతోంది. కౌలుకు తీసుకున్న రైతులు మరింత ఖర్చు చేయాల్సి వచ్చింది. గతేడాది కంటే ఆదాయం పెరుగుతుందనుకున్న రైతులకు అప్పులు కూడా తీరని పరిస్థితి ఏర్పడింది. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 4,182 హెక్టార్ల విస్తీర్ణంలో జీడిమామిడి తోటలున్నాయి. కొండ, మెట్ట ప్రాంతాలు జీడి సాగుకు అనువుగా ఉంటుంది. రాజానగరం నియోజకవర్గంలో 2,690 హెక్టార్లు, అనపర్తి నియోజకవర్గంలో 1,492 హెక్టార్ల విస్తీర్ణంలో జీడిమామిడి సాగవుతోంది.

గణనీయంగా తగ్గిన దిగుబడి

గంపెడాశతో రైతులు జీడి సాగు చేపట్టి, దుక్కులు, చెట్ల మొదలు పిచ్చి మొక్కల తొలగింపు తదితర చర్యలను నిర్వహించారు. నీరు చెట్టు మొదలుకు చేరేలా చుట్టూ పళ్లాలను తవ్వించడం, చెట్ల కొమ్మలను వీడింగ్ తదితర సస్యరక్షణ చర్యలు నిర్వహించారు. పలురకాల మందులను పిచికారీ చేశారు. మంచి దిగుబడులుంటాయనుకున్న రైతులకు కాలం కలిసి రాలేదు. ఎకరం విస్తీర్ణంలోని తోటకు రూ.25 వేల వరకు ఖర్చు చేయగా, కౌలు రైతులకు ఇది రెట్టింపయింది. చాలామంది రైతులు అప్పు చేసి పెట్టుబడులు పెట్టడంతో, దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణంలోని తోటలు కౌలుకు తీసుకున్న రైతులకు తీవ్ర నష్టాలు మిగిలాయి. ఎకరం విస్తీర్ణంలోని చెట్టుకు 700 కేజీల స్థానే 200 కేజీలు మాత్రమే దిగుబడి వచ్చింది.

కారణాలెన్నో..!

వాతావరణం అనుకూలించకపోవడంతో ఏప్రిల్ నెలాఖరు చేరినప్పటికీ జీడి పంట ఆశించినంతగా లేదు. దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. తేనె మంచు, తేయాకు దోమ తదితర కారణాలు కూడా నష్టాలను మిగిల్చాయి. ఫిబ్రవరి నుంచి వేసవి ఎండలతో వాతావరణం వేడెక్కుతోంది. దీంతో జీడితోటలు మంచిగా పూత పూస్తాయి. అదే క్రమంలో పిందె దశకు చేరుతుంది. మార్చి రెండో వారానికి పూత దశకు చేరిన తోటలు, పిందె దశకు చేరడానికి ఆలస్యమైంది. దీంతో వాతావరణంలో మార్పుల కారణంగా పూత, పిందె కూడా రాలిపోవడం, మాడిపోవడం జరిగాయి. అలాగే జీడిపిక్క ఎదుగుదల కూడా ఆలస్యమైంది.

గిడ్డంగులకు రాయితీ



జీడిపంటకు మంచి ధర వచ్చే వరకూ పంటను నిల్వ చేసుకునేందుకు వీలుగా గిడ్డంగుల సౌకర్యం కల్పిస్తున్నాం. రైతులు సంఘంగా ఏర్పడితే రాయితీలు పొందవచ్చు. ఆసక్తి ఉన్న రైతులు కోరితే ప్రభుత్వం గిడ్డంగులను పొందవచ్చు. వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి తగ్గింది. ఏటా ఆశించినంత దిగుబడులతో లాభాలార్జించిన రైతులు ప్రస్తుతం నష్టపోతున్నారు.

– రినీ, ఉద్యాన శాఖాధికారి

దిగుబడి అంతగా లేదు



ఈ సంవత్సరం రైతులు ఆశించినంత ధర పలికింది. వాతావరణంలో మార్పుల కారణంగా తేమ ఏర్పడి దిగుబడి తగ్గిపోయింది. ఎకరానికి 700 కేజీల దిగుబడి జరగాల్సి ఉండగా, కేవలం 200 కేజీలు మాత్రమే వచ్చింది. అధిక దిగుబడుల కోసం సస్యరక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ ఫలితం శూన్యం.

– కోటా సుబ్రహ్మణ్యం, జీడి వ్యాపారి

మంచి ధర ఉన్నా..

జీడి పంటకు కేజీ 150 నుంచి 250 వరకు ధర పలికినా, దిగుబడులు ఆశించిన మేరకు లేవు. దీంతో రైతులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. దిగుబడులు పెరిగితే లాభాలు ఆర్జించవచ్చన్న ఆశతో రైతులు సాగు చేపట్టారు. ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి పెట్టారు. ఎకరానికి 450 నుంచి 700 కేజీల దిగుబడి ఉంటుందని ఆశించారు. ఎకరానికి కేవలం 200 కేజీల జీడిపిక్కల దిగుబడికి పరిమితమైంది.


షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం


వెలమపేటలో దగ్ధమవుతున్న తాటాకిల్లు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం పంచాయతీలోని వెలమపేటలో నివసిస్తున్న కోడూరి సన్యాసరావుకు చెందిన తాటాకిల్లు అగ్ని ప్రమాదంతో దగ్ధమైంది. శుక్రవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆకస్మికంగా ఎగసిన మంటలను అదుపు చేసేందుకు స్థానికులు నీళ్లు విరజిమ్మారు. విద్యుత్ సరఫరా ఉండడంతో మంటలు మరింత ఎగసిపడ్డాయి. దీంతో కోట బుజ్జియ్య విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించడంతో, విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రమాదం జరిగిన ఇంటిని ఆనుకుని ఆనేపల్లి ఈశ్వరమ్మకు చెందిన డాబా కిటికీలు, లోపలి సీలింగ్, విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. తాటాకింట్లోని వంట సామగ్రి, మంచాలు, టీవీ, ఫ్యాన్లు దగ్ధమయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం మంటలను అదుపు చేసింది. సుమారు 2.50 లక్షలు నష్టం ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి బియ్యం అందించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆర్థికసాయం చేశారు.

డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



పెదపూడి: డైవర్షన్ రాజకీయాల కోసం అసత్యాలను నిజాలుగా చిత్రీకరించే ప్రయత్నాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. అనపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల అనపర్తి గ్రామానికి చెందిన మహిళా నాయకురాలు కర్రి శేషారత్నం చేసిన ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే స్పందించారు. డైవర్షన్ రాజకీయాల కోసం అసత్యాలను నిజాలుగా చిత్రకరించే ప్రయత్నంలో భాగంగా తన కుటుంబంపై, తనపై వ్యక్తిగత విమర్శలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేయిస్తున్నారంటూ ఆరోపించారు. అసత్యాలు మాట్లాడి తమ విలువలు తగ్గించుకోవద్దంటూ కర్రి శేషారత్నానికి ఆయన హితవు పలికారు. దేవీ నవరాత్రుల్లో ఏర్పాటు చేసిన సత్సంగం సంబంధించి 40 కాసులు బంగారం, రూ.కోటి నగదు మిగులు ఉందని తెలిసిందన్నారు. ఆ సత్సంగ సంఘం సభ్యులు వేరే సంఘాలకు ఎందుకు వెళ్లిపోయారో సమాధానం చెప్పాలన్నారు. ఆయా సభ్యులు వీరుళ్లమ్మ సత్సంగంలో ఆధ్యాత్మిక సేవలో ఉన్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత స్వలాభం కోసం చౌకబారు రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు.

రుణాల కోసం నేడు ఇంటర్వ్యూలు

బిక్కవోలు: వివిధ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, మండలవ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సబ్సిడీపై ఆయా కార్పొరేషన్లకు దరఖాస్తు చేసుకున్న 595 మంది హాజరుకావాలన్నారు. దరఖాస్తుదారుడు దరఖాస్తుతో పాటు, ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇంటర్వ్యూలకు తీసుకుని రావాలన్నారు. ఉదయం 10 గంటలకు దరఖాస్తుదారులు హాజరుకావాలని చెప్పారు.

రంగంపేట: మండలంలోని వివిధ కార్పొరేషన్ల రుణాలకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.వీరసాయిబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల వ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్లకు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుదారులు దరఖాస్తుతో పాటు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా మానవహారం


సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న మానవహారం

సీతానగరం: జమ్ము–కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కూటమి నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, ఈ మారణకాండ విచారకరమన్నారు. అనంతరం ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బస్టాండ్ వద్ద మరుగు సమస్య


బస్టాండ్ వద్ద శిథిలావస్థకు చేరిన మహిళల మరుగు

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండలోని బస్టాండ్ వద్ద మహిళా ప్రయాణికుల సౌకార్యార్థం మరుగు సదుపాయాన్ని కల్పించాల్సి ఉంది. గతంలో నిర్మించిన మరుగు శిథిలావస్థకు చేరడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు చాలా కాలంగా కోరుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాల సందర్భంగా మరుగు సదుపాయాన్ని కల్పిస్తామన్న అధికారులు ఆ మేరకు కనీస చర్యలు తీసుకోలేదు. ఇటీవల జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో స్థానికులు ఈ సమస్యను ఆర్టీసీ గోకవరం డీఎం సుచరిత మార్గరెట్ దృష్టికి తీసుకెళ్లారు. కొందరు వ్యాపారుల కారణంగా బస్టాండ్ ఆవరణ ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారులను ఖాళీ చేయించేందుకు మండల అధికారులు సహకరించాలని ఆమె కోరారు. అలాగే మరుగు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలి పారు. ఇలాఉండగా కోరుకొండ మండలంలోని 22 గ్రామాలు, సీతానగరం మండలంలోని 8, గోకవరం మండలంలోని 4 గ్రామాలకు చెందిన ప్రయాణికులు ఇక్కడికి వందల సంఖ్యలో వస్తుంటారు.

వేసవిలో వృథాగా తాగునీరు

- రెండు నెలలుగా లీకేజీ
- పట్టించుకోని యంత్రాంగం


వినాయకుని ఆలయం వద్ద లీకేజీ అవుతున్న పైపులైన్

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి పంచాయతీ వెనుక వినాయకుని ఆలయం వద్ద టీపీ స్కీమ్ సబ్ కెనాల్‌ను ఆనుకుని జల్‌జీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన పైపులైన్ పగిలిపోయింది. రెండు నెలల క్రితం పగిలిన ఈ పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. రెండు రోజుల్లోనే తిరిగి అక్కడ లీకేజీ మొదలైంది. ఇది జరిగి రెండు నెలలవుతున్నా ఇప్పటివరకు పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. పైపులైన్ నుంచి ఫౌంటేన్‌లా శుద్ధి అయిన గోదావరి జలాలు ఎగసిపడి వృథాగా టీపీ స్కీమ్ సబ్ కెనాల్‌లోకి వెళుతున్నాయి. మండు వేసవి, తాగునీటి సమస్య రాకుండా చూడాలంటూ ఉన్నతాధికారులు సమావేశాల్లో ఇస్తున్న ఆదేశాలు నీటి మూటలుగా మిగులుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గోదావరి శుద్ధి జలాలు వృథా కాకుండా, పైపులైన్‌కు తక్షణం మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు

గృహాల తొలగింపు హేయమైన చర్య

బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కన్వీనర్ వేణుగోపాల్


దోమాడలో దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న వేణుగోపాల్

పెదపూడి: ఏడు దశాబ్దాలుగా ఎవరికీ అడ్డులేని గృహాలు ఇప్పుడు ఓ ప్రైవేటు వెంచర్‌కు అడ్డొచ్చిందని లేఅవుట్ పొడవునా ఉన్న 9 గృహాలు తొలగించడం హేయమైన చర్య అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణుగోపాల్ మండిపడ్డారు. దోమాడ గ్రామంలో చెరువు గట్టుపై ఇళ్లు కోల్పోయిన 9 కుటుంబాల బాధితులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష శుక్రవారం మూడో రోజుకు చేరింది. శిబిరాన్ని వేణుగోపాల్ సందర్శించి, మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జి.మామిడాడ నుంచి కాకినాడ వరకు రోడ్డు పక్కన ఆర్అండ్‌బీ రోడ్డులో చాలా మంది షాపులు, గృహాలు నిర్మించుకుని జీవిస్తున్నారన్నారు. దోమాడలో గృహాలు తొలగించిన అధికారులకు ఆయా గ్రామాల్లో ఇళ్లు, షాపులు ఎందుకు కానరావడం లేదని ప్రశ్నించారు. అధికారులు, లేఅవుట్ యజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు మాట్లాడుతూ, రాజ్యాంగ, మానవ హక్కుల ఉల్లంఘనకు అధికారులు పాల్పడ్డారని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ యజమాని కోసం వివిధ శాఖల అధికారులు ఇళ్లు కూల్చివేయడం అన్యాయమన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓల ప్రమేయం లేనప్పటికీ, ఎందుకు పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ, అర్అండ్‌బీ అధికారులు, పోలీసులు ఇళ్లు కూల్చారని ప్రశ్నించారు. వీరందరిపైనా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జైభీమ్ భారత్ పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ మాట్లాడుతూ, బాధితులకు రూ.25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని, ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ మాట్లాడుతూ, బాధితులు ఇక్కడే మళ్లీ ఇళ్లు నిర్మించుకుంటారన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత బహుజన్ ఫ్రంట్ నాయకుడు చెంగలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి, పంపన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ప్రదర్శన



నల్ల రిబ్బన్లు ధరించి, కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

రాజానగరం: పహెల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో బలైన పర్యాటకులకు నివాళులర్పిస్తూ స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు శుక్రవారం నల్ల రిబ్బన్లు ధరించి, కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

మండల కేంద్రాలకు పాఠ్య పుస్తకాల తరలింపు


పుస్తకాల సరఫరాను పరిశీలిస్తున్న జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

ధవళేశ్వరం: వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాల సరఫరా ప్రారంభమైందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు తెలిపారు. ధవళేశ్వరంలోని పాఠ్య పుస్తకాల గోడౌన్ నుంచి మండల కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా పుస్తకాల పంపిణీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ, స్కూళ్లు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తామని చెప్పారు. పాఠ్య పుస్తకాల బరువు తగ్గిందని, విద్యార్థులకు ఇది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆయన వెంట పాఠ్య పుస్తకాల డిపో మేనేజర్ పి.సురేష్, ఆర్టీసీ రవాణా ప్రతినిధి మూర్తి ఉన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ


పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సీతానగరం: ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి ర్యాలీ కొనసాగింది. డాక్టర్ సునీల్ మాట్లాడుతూ, మలేరియా వ్యాధికి ప్లాస్మోడియం అనే క్రిమి కారణమని, ఈ వ్యాధి మనిషుల మధ్య అనాఫిలిస్ అనే ఆడదోమ ద్వారా వ్యాపిస్తుందన్నారు. వ్యాధి సోకిన తర్వాత నిర్లక్ష్యం చేస్తే మరణం సంభవిస్తుందని హెచ్చరించారు. ప్రజలందరూ ఇంటి పరిసరాల్లోను, ఇంటి లోపల నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఎన్ ఆదిలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ స్వరూపారాణి, ఫార్మసీ ఆఫీసర్ నగేష్, ఎల్‌టీ శిల్ప సౌందర్య, హెల్త్ అసిస్టెంట్ ఎస్ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు మున్నీసాబేగం, సలీమా బేగం, పద్మ, కృష్ణవేణి, విశాలాక్షి, రమణ, ప్రశాంతి, అరుణ, సద్యం, అమృత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.